క్లుప్తంగా

మన ఇంటి ఆడపడుచు గొబ్బెమ్మ



గొబ్బెమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : గొబ్బెమ్మతల్లిని ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆడపడుచుగా భావించి పండుగ సమయంలో ఆహ్వానించి పూజలు చేసి సాగనంపుతారని ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఆకేపాడులోని పెద్దూరు గ్రామంలో బుధవారం రాత్రి గొబ్బెమ్మ తల్లి సాగిపోయే కార్యక్రమాన్ని ఆగ్రామ ప్రజలు అట్టహాసంగా చేపట్టారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆకేపాటి ముందుగా గొబ్బెమ్మకు పూజలు చేశారు. మహిళలు పాటలను ఆలపిస్తూ గొబ్బెమ్మ చుట్టూ ఆడారు.

పింఛన్ల లబ్ధిదారులను విచారించిన వైద్యులు



మంచానికే పరిమితమైన పింఛన్ లబ్ధిదారుడిని విచారిస్తున్న వైద్య బృందం

సుండుపల్లె : మండల పరిధిలో మంచానికే పరిమితమై రూ. 15 వేలు పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారులను రిమ్స్ వైద్య బృందం గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని 29 మంది దివ్యాంగులకు నెలకు రూ.15 వేలు చొప్పున పింఛన్ ఇస్తున్నారు. వారు నడవలేని స్థితిలో ఉన్నారా లేదా ఆరోగ్య పరంగా ఎలా ఉన్నారనే విషయాలపై రిమ్స్ వైద్య బృందం డాక్టర్ కేఆర్ శేఖర్ రెడ్డి, డాక్టర్ సి.రవికుమార్ రెడ్డి, సుండుపల్లి వైద్యాధికారి అసన్ వలీ తదితరులు పరిశీలించారు. తుది నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తామని వారు తెలియజేశారు.

పరీక్ష సామగ్రి అందజేత

నందలూరు : పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదోతరగతి చదువుతున్న 43 మంది విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడు అనుంపల్లి పుల్లయ్య కుమారుడు వరప్రసాద్ గురువారం పరీక్షా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.మాధవీలత, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ రెడ్డి, సుస్మిత, సుదర్శన్ రాజు, షఫీ, లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సప్త ఆరాధనోత్సవాలు

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేట గ్రామం సమీపంలోని దర్బారు సాయి నగర్ దర్గా వద్ద శుక్రవారం నుంచి సప్త ఆరాధన మహోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. సద్గురు దర్గా స్వామిజీ సప్త ఆరాధన ఉత్సవాలు సందర్భంగా శుక్రవారం ఉదయం 8గంటల నుంచి ప్రారంభమవుతాయని, పూజలు, అభిషేకాలు, హోమాలు అనంతరం మంగళహారతి, ప్రసాద వితరణము జరుగుతుందన్నారు. సాయంత్రం పల్లకి సేవ ఉంటుందని కమిటీ సభ్యులు సత్యమయ్య స్వామిజీ, శంకరయ్య స్వామిజీలు తెలిపారు.

పబ్లిక్ పరీక్షలకు సమాయత్తం అవ్వాలి

చిన్నమండెం : మార్చిలో జరగబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా సమాయత్తం కావాలని డిప్యూటీ డీఈఓ శివప్రకాష్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మండల పరిధిలోని మల్లూరు, చాకిబండలలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులతో స్వయంగా మాట్లాడారు. విద్యార్థులకు సందేహాలను నివృత్తి చేసి పలు సూచనలు, సలహాలను అందజేశారు.

ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

నందలూరు : జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మణ్ నాయక్ నందలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ల్యాబ్, మలేరియాకు సంబంధించిన రికార్డులను పరిశీలించి ల్యాబ్ టెక్నీషియన్, వైద్యులు, సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ శరత్ కమల్, డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్, సీహెచ్ఓ వెంకటనారాయణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కోడూరులో ఏఐటీయూసీ జిల్లా మహాసభలు

రైల్వేకోడూరు అర్బన్ : అన్నమయ్య జిల్లా ఏర్పడిన తరువాత మొట్టమొదటిసారిగా రైల్వేకోడూరులో ఫిబ్రవరి 16, 17వ తేదీలలో జరగనున్న ఏఐటీయూసీ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు తుమ్మల రాధాకృష్ణ గురువారం పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా జిల్లా చరిత్రలో రైల్వేకోడూరులో ప్రథమ మహాసభలు జరుగుతున్నాయని, ఈ సభలలో కార్మికులు, పేదలు, పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గంగాధర్, వెంకటరమణ, సరోజమ్మ, నిర్మలమ్మ, రత్తమ్మ, రమేష్ పాల్గొన్నారు.

పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ!

- ప్రకృతి వ్యవసాయ విధానంపై రైతుల ఆసక్తి
- భూసారం పెంచవచ్చంటున్న అధికారులు
- కషాయాల తయారీకి పూర్తి సహకారం

నియోజకవర్గంతో ప్రకృతి వ్యవసాయం సాగులో ఉన్న విస్తీర్ణం (ఎకరాల్లో)

ఓబులవారిపల్లె	320
చిట్వేలి	128
రైల్వేకోడూరు	190
పుల్లంపేట	160
పెనగలూరు	080





క్షేత్రస్థాయిలో రైతులకు కషాయాల తయారీలో శిక్షణ ఇస్తున్న వ్యవసాయ అధికారులు



ఓబులవారిపల్లెలో ప్రకృతి వ్యవసాయం విధానంలో సాగు అవుతున్న అరటి



చిన్న ఓరంపాడులో బొప్పాయి మొక్కలను నాటుకున్న రైతు

ఓబులవారిపల్లె : ప్రకృతి వ్యవసాయం లాభాదాయకంగా ఉండటంతో నియోజకవర్గంలోని రైతులు ప్రకృతి వ్యవసాయం అనుసరించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం చేసేందుకు రైతులకు ప్రోత్సాహం అందిస్తుంది. ఇందుకు వ్యవసాయ అధికారులు నేరుగా రైతుల పంట పోలాలకు వెళ్లి సేంద్రియ ఎరువుల తయారీ, వినియోగంపై సూచనలు, సలహాలను ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. దీంతో రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేందుకు మక్కువ చూపుతున్నారు. రసాయనిక ఎరువులు వాడకంతో తరచూ రైతులకు నష్టపోతుండడంతో పెట్టుబడి తక్కువగా ఉండే ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం కొందరు రైతులు ఈ ప్రక్రియ ద్వారా పంటలు పండించి అధిక దిగుబడులు సాధించడంతో ఇతర రైతులు కూడా ఈ విధానాన్ని పాటించేందుకు ముందుకు వస్తున్నారు.

భూమికి జీవమిచ్చే ప్రకృతి ఎరువులు

రైతులు భూసార పరీక్షల ఆధారంగా పంటలను ఎన్నుకొని అందులో రసాయనిక ఎరువుల వినియోగానికి బదులు పూర్తిగా ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటల సాగుచేస్తున్నారు. పంటను నాటిన నాటి నుంచి విత్తనం మొలకెత్తేందుకు, మొక్కల ఎదుగుదలకు బీజామృతం, ఘనజీవమృతం, ద్రవ జీవామృతం ద్వారా పంటకు కావలసిన అన్ని సూక్ష్మ, స్థూల పోషకాలను అందిచడం జరుగుతుంది. ఇవి పంటలు దిగుబడి పెంచేందుకు దోహదపడతాయి. అదే విధంగా పంటకు సోకే చీడపీడల నివారణకు కూడా రసాయనిక మందులకు బదులుగా ప్రకృతి వ్యవసాయం ద్రవ నీమాస్త్రం, వావిలకుల కషాయం, తూటికడ కషాయం, బ్రహ్మాస్త్రం, అగ్నిహస్త్రం తయారు చేసి పంటలకు పిచికారీ చేయడం జరుగుతుంది. వీటి వినియోగం ద్వార భూమి సారవంతమే కాక జీవం వస్తుందని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు.

పెట్టుబడి తక్కువ

ప్రకృతి వ్యవసాయనికి పెట్టుబడి అవసరం లేదు. ఇందులో వాడే పదార్థాలు గ్రామీణ ప్రాంతల్లోనే లభిస్తాయి. వీటి వినియోగంతో ఎటువంటి ఇబ్బందులు ఉండవు. ఆవుపేడ, గో మూత్రం, సున్నం, పుట్టమట్టి, బెల్లం, వేపాకులు, రెమ్మలు, చిగుర్లు సమీపంలో దొరికే చాలా రకాల ఆకులతో ఎరువుల తయారీకి ఉపయోగపడతాయి. వీటిని డ్రిప్ యంత్రాల ద్వారా నేరుగా మొక్కలకు ఇవ్వడం జరుగుతుంది. వ్యవసాయ శాఖ అధికారులు సిబ్బంది రైతులు ప్రకృతి వ్యవసాయం ఏ విధంగా చేయలో సలహాలు ఇస్తూ రైతులకు చేయూతనిస్తున్నారు. దీంతో నియోజకవర్గంలోని రైతులు కూరగాయలు అరటి, బొప్పాయి, తదితర పంటలను పండిస్తూ ఆదాయం చూస్తున్నారు.

ఆరోగ్యానికి శ్రేయస్కరం

ప్రస్తుత ఆధునిక సమాజంలో ఎక్కువగా జబ్బుల బారిన పడుతున్న ప్రజలు ఎక్కువగా కూరగాయల వినియోగిస్తున్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఇందుకు అనుగుణంగా గతంలో కంటే ఇప్పుడు కూరగాయల వినియోగం పెరిగింది. యూట్యూబ్ అందుబాటులోకి రావడంతో ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తున్నారు. పట్టణాలలో సైతం ప్రకృతి వ్యవసాయం ద్వార పండిన పంటలను కోనుగోలు చేస్తున్నారు. ధర ఎక్కువగా ఉన్న ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన వాటిని కొనుగోలు చేస్తున్నారు.

భవిష్యత్తులో మంచి డిమాండ్

పూర్తి స్థాయిలో సేంద్రియ ఎరువులు, ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు భవిష్యత్తులో మంచి డిమాండ్ ఉంటుంది. రసాయనిక ఎరువులతో పండించిన కూరగాయలు ఎక్కువ రోజులు తాజాగా ఉండవని అదే ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు పండ్లు ఎక్కువ రోజులు తాజాగా ఉంటున్నాయి. అంతే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. మార్కెట్‌లో ఈ విధానం ద్వార పండించిన ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. దీంతో రైతులకు మంచి ఆదాయం వస్తోంది. ప్రధానంగా అరటి, బొప్పాయి, తమలపాకు తోటలు వేసిన రైతుల తమ పంటలను ఢిల్లీ, ముంబై, రాజస్థాన్, కర్ణాటక తదితర రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తున్నారు. చాలా రోజుల పాటు నిల్వ ఉంటడం నాణ్యత బాగుండటంతో వ్యాపారులు ఈ తరహాలో పండించిన పంటలను కొనుగోలు చేసేందుకు ముందుకొస్తున్నారు.

తమలపాకు ధర పలుకుతుంది



నేను సొంతంగా ప్రకృతి వ్యవసాయం సంబంధించిన అన్ని ద్రావణాలు, కషాయాలు తయారు చేస్తాను. తమలపాకు, అరటి సాగు చేస్తున్నాను. తమలపాకుల తోట ఆకులు నాణ్యతతో పెద్ద సైజులో రావడంతో ప్రస్తుత మార్కెట్ కంటే ఎక్కువ ధర వస్తోంది. గంప దాదాపు రూ.800 వరకు రావడంతో లాభదాయకంగా ఉంది. ద్రావణాలు, కషాయాలు తయారు చేసుకోలేని రైతులు సంప్రదిస్తే వారికి ద్రావణాలు, కషాయాలు సరఫరా చేస్తాను.

– ఓరంపాడు నాగేంద్ర, రైతు, త్యాగరాజు కాలనీ, ఓబులవారిపల్లె

దిగుబడి బాగా వచ్చింది



దాదాపు పది ఎకరాల్లో అరటి బొప్పాయి పంటలను పూర్తి స్థాయిలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్నాను. చీడపీడల నివారణకు కషాయాలు, ద్రావణాలు ఉపయోగిస్తున్నారు. ఎటువంటి రసాయనిక మందులు వినియోగించడం లేదు. పంట మొక్క దశ నుంచి ఆరోగ్యకరంగా పెరుగుతున్నాయి. దిగుబడి బాగా వచ్చి లాభాలు పొందాను. భవిష్యత్తులోనూ పూర్తిగా ప్రకృతి వ్యవసాయం చేయాలని నిర్ణయించుకున్నాను.

– కంచెర్ల నరేష్‌నాయుడు, రైతు, చిన్నఓరంపాడు, ఓబులవారిపల్లె

రైతులకు సహకారం అందిస్తాం



ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి ఉన్నవారికి వారి పంట పొలం వద్దే ప్రకృతి ఎరువులను, కషాయాలు తయారు చేసుకోనేందుకు అన్ని విధాల సహకారం అందిస్తున్నాం. ప్రతి రోజు రైతుల వద్దకు వెళ్లి సూచనలు ఇస్తూ ప్రోత్సహిస్తాం. ఆసక్తి ఉన్న రైతులు సంప్రదిస్తే వ్యవసాయ విధానాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తాం. రైతులు పండించిన కూరగాయలను ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో ప్రతి సోమవారం విక్రయాలు జరుపుతున్నాం.

– పొలంనేని బుల్లయ్య, ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జ్, ఓబులవారిపల్లె

లాభదాయకం, ఆరోగ్యకరం



రసాయనిక ఎరువులు అధికంగా వినియోగించడం ద్వారా భూములు నిస్సారమై సుక్ష్మపోషకలు అంతరిచిపోయాయి. దీంతో భూములు గట్టిగ మారి దిగుబడి తగ్గుతోంది. ప్రకృతి వ్యవసాయం ఎరువుల వినియోగం చేసే భూములు సుక్ష్మ పోషకలు ఏర్పడటానికి కొంత సమయం పడుతుంది. రైతులు కష్టపడి సాగు చేస్తే భవిష్యత్తులో మంచి లాభాలు ఉంటాయి. అంతే కాకుండా ప్రకృతి వ్యవసాయం పంటలకు డిమాండ్ ఉంటుంది. పెట్టుబడి లేని వ్యవసాయంపై రైతులకు శిక్షణతోపాటు మెళకువలను అందిస్తాం.

– మల్లిక, వ్యవసాయ అధికారి, ఓబులవారిపల్లె

ఇసుక అక్రమ రవాణాతో.. మండల ప్రజానీకంపై తీవ్ర ప్రభావం



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ గాలివీటి

వీరబల్లి : మండలంలోని ప్రజలు, రైతులు ఏవైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరించేందుకు మండల అధికారులు కృషి చేయాలని మండల ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలోని ఎంపీపీ ఆఫీసులో మండలస్థాయి అధికారులతో ఆయన మాట్లాడారు. ప్రజలు పలు సమస్యలపై కార్యాలయానికి వస్తే వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఫ్రీ ఇసుక ప్రకటించడంతో అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇసుకను ట్రాక్టర్లతో ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని చెప్పారు. అధికార పార్టీ నేతల ఆగడాలతో మాండవ్య నదిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మండల ప్రజలు, రైతులపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా అక్రమంగా ఇసుక రవాణాను అడ్డుకోవాలని లేకుంటే మండల ప్రజలకు గడ్డుకాలం తప్పదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్‌డీ రామచంద్రారెడ్డి, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రుణాల మంజూరులో లక్ష్యాలను పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి




సమీక్షా కార్యక్రమంలో కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి జగదాంబసెంటర్ : ఎస్సీ, మైనార్టీ కార్పొరేషన్లు ఇచ్చే రుణాల మంజూరులో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీసీ హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఎస్సీ, మైనార్టీ కార్పొరేషన్‌ల అధికారులు, బ్యాంకర్లతో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా ఎల్డీఎం ఆంజనేయులు సమావేశాన్ని ప్రారంభిస్తూ ఎస్సీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా 2024–25 సంవత్సరానికి గాను నిర్దేశించిన లక్ష్యాలను వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి 690 యూనిట్లకు గాను రూ.11.97 కోట్ల రుణాలను బ్యాంకుల ద్వారా అందిస్తున్నట్లుగా తెలిపారు. ఎస్సీ, మైనార్టీ కార్పొరేషన్ల ఈడీ బ్రహ్మయ్య మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా ఈ రుణాలు పొందేందుకు లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు నిబద్ధతతో పనిచేసి లబ్ధిదారులకు రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎల్డీఎం ఆంజనేయులు, ఈడీ వల్లూరు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య కేంద్రంగా విలేజ్ హెల్త్ క్లినిక్

రామాపురం : మండలంలోని గువ్వలచెరువ గ్రామ పరిధిలోని శిధిలావస్థకు చేరుకున్న విలేజ్ హెల్త్ క్లినిక్‌ను గురువారం సీపీఐ బృంద రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు, మర్రి సుమిత్ర, సుదర్శన్‌లు పరిశీలించారు. మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని పేదలకు మెరుగైన వైద్య సదుపాయం కలిపిస్తున్నామని గొప్పలు చెబుతున్నారే తప్ప ఆచరణలో సాధ్యం కాలేదన్నారు. ఇందుకు నిదర్శనం గువ్వలచెరువు ప్రాథమిక ఉప కేంద్రం శిధిలావస్థకు చేరడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్య కేంద్రానికే అనారోగ్యం వస్తే ప్రజలు ఎక్కడికి వెళ్తారని ఎద్దేవా చేశారు. ముందువైపు డ్రైనేజీ మురికినీరు చుట్టూ ప్రహరీ గోడ లేక పిచ్చి మొక్కలతో పాములు, విష పురుగులు తిరుగుతుండడంతో అక్కడ పనిచేస్తున్న సిబ్బంది ఎప్పుడూ ఏం జరుగుతుందోనని భయాందోళనలో ఉన్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి పక్కా భవనం ఏర్పాటు చేసి పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. వీరితో పాటు సీపీఐ నాయకులు జగదీష్, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

‘వర్ధంతిలేని గొప్ప నాయకుడు సుభాష్ చంద్రబోస్’



రాజంపేట టౌన్: సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

రాజంపేట టౌన్ : జయంతి తప్ప వర్ధంతి లేని గొప్ప నాయకుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్ నాయుడు తెలిపారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు వీవీ రమణ ఆధ్వర్యంలో గురువారం బోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమేష్‌నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో సుభాష్ చంద్రబోస్ మాటలు ప్రజల్లో చైతన్యం నింపాయన్నారు. స్వాతంత్ర్యం అంటే అడిగి తీసుకునే భిక్ష కాదు పోరాడి సాధించుకునే హక్కు అన్న మాట యువతను ఉద్యమం వైపు అడుగులు వేయించిందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో..

రాజంపేట : కేంద్రీయ విద్యాలయంలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ రకాల పోటీలను నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపల్ నీరజ్ కుమార్ మాట్లాడుతూ పోటీలు ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం పొందవచ్చని, నేతాజీ ఆశయాలతో విద్యార్థులు ముందుకు వెళ్లాలని కోరారు.

వధూవరులకు ఆశీర్వాదం

రామాపురం : చిట్లూరు అరుంధతివాడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రామచంద్రపు చిన్నవెంకట సుబ్బయ్య కుమారుడి వివాహ వేడుకలకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్‌కుమార్‌రెడ్డిలు వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వీరితోపాటు మాజీ సర్పంచ్ మురళీమోహన్‌రెడ్డి, హరినాథరెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సగినాల శివశంకర్, ఆదిరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, పాల్‌రెడ్డి, సీతారాం, ఓబులేసు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి

గాలివీడు : సురక్షిత ప్రయాణానికి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్ఐ రామకృష్ణ సూచించారు. గురువారం పోలీస్ సిబ్బందితో కలసి గ్యాస్ గోడౌన్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలామంది ద్విచక్ర వాహన చోధకులు హెల్మెట్ ధరించని కారణంగానే రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారని తెలిపారు. తలకు తీవ్రగాయాలు తగిలి విలువైన సమయంలో చికిత్స అందక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. హెల్మెట్ ధరించడంతో కలిగే ప్రయోజనాలను వాహనదారులకు వివరించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేదంటే నిబంధనల ప్రకారం అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండల పరిధిలో సీఐ హేమసుందర్ రావు ఆధ్వర్యంలో గురువారం ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు అపరాధ రుసుములు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ నవీన్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

26న చిట్వేలిలో రక్తదాన శిబిరం

చిట్వేలి : అన్ని దానాల్లో కెల్లా రక్తదానం మిన్న అని, రక్తదాతలు ప్రాణదాతలు అవుతారని రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈనెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చిట్వేలి హెల్ప్‌లైన్ సొసైటీ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలియజేశారు. గురువారం సొసైటీ సభ్యులు సీఐ, ఎస్ఐలను కలిసి కార్యక్రమానికి అనుమతి కోరారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐలు మాట్లాడుతూ రహదారుల భద్రత ఎంతో అవసరమని వాహనదారుల నిర్లక్ష్యంగా కారణంగా తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాలలో గాయపడిన వారికి రక్తం అవసరత అధికంగా ఉంటుందని అలాంటి సమయాల్లో రక్తదానం చేసేవారు ఎంతో అవసరమన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు మండలంలోని యువతతోపాటు ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి విజయవంతం చేయాలని కోరారు. సీహెచ్ఎస్ సభ్యులను వారు అభినందించారు. కార్యక్రమంలో సీహెచ్ఎస్ సంస్థ కార్యవర్గ సభ్యులు ఎం.భాస్కర్ రెడ్డి, బి.శివనాగేశ్వరరావు, జి.ఇంతియాజ్, అహ్మద్, పెంచలయ్య, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు మోక్షం కలగకపోవడం దౌర్భాగ్యం



నేషనల్ హైవేపై ఉన్న గుంతలలో మొక్కలు నాటి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

రాజంపేట రూరల్ : ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా నేషనల్ హైవేపై ఉన్న గుంతలలో మొక్కలు నాటి కాంగ్రెస్ పార్టీ నాయకులు వినూత్నంగా నిరసన చేపట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణ శివారులోని కె.బోయినపల్లిలో నేషనల్ హైవేపై ఉన్న పెద్దపెద్ద గుంతల వలన ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికుల గురించి కూటమి ప్రభుత్వం పట్టీ పట్టనట్లు ఉన్నందుకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పూల భాస్కర్ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నుంచి తిరుపతి వరకు నేషనల్ హైవేపై ఉన్న పెద్దపెద్ద గుంతలను వెంటనే పూడ్చి వేయాలని డిమాండ్ చేశారు. ఈ మధ్య కాలంలో ఒంటిమిట్ట నుంచి రేణిగుంట వరకు ప్రయాణించిన ప్రయాణికులలో ఎన్ని ఎంఎల్‌సీ కేసులు ఉన్నాయో పోలీసు రికార్డులు పరిశీలించాలని సూచించారు. ఈ జాతీయ రహదారిపై ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రిలలో ఎంత మంది ప్రమాదాలలో గాయపడి వైద్యం చేయించుకున్నారో మీకు తెలియడంలేదా అని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబునాయుడు స్వయంగా సంక్రాంతి నాటికి రహదారిపై గుంతలు ఉండకూడదని స్థానిక ఎమ్మెల్యేలకు సూచించినప్పటికీ ఇక్కడ రహదారులకు మోక్షం కలగకపోవడం దౌర్భాగ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కూటమి ప్రభుత్వం ప్రజల కష్టాలను గుర్తించి రహదారులను అభివృద్ధి చేయాలని కోరారు. లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు షేక్ మహమ్మద్ ఆదిల్, షేక్ అబ్దుల్లా, నాసిర్, నాగూర్, కె.సుధాకర్, రసూల్, మహమ్మద్‌అలీ, యాస్మిన్ తదతరులు పాల్గొన్నారు.

చేతిరాతతో వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవచ్చు



మాట్లాడుతున్న డాక్టర్ కాశిగారి ప్రసాద్

రాజంపేట : చేతిరాత ద్వారా వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవచ్చని గ్రాఫాలజిస్ట్ డాక్టర్ కాశిగారి ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం బోయనపల్లిలోని అన్నమాచార్య యూనివర్సిటీలో జాతీయ చేతి రాత దినోత్సవాన్ని పురస్కరించుకొని టచ్‌స్టోన్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కాశిగారి ప్రసాద్ మాట్లాడుతూ చేతి రాత ద్వారా వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవచ్చన్నారు. చేతిరాత అనేది కేవలం భావ వ్యక్తీకరణకు ఒక సాధనం మాత్రమే కాదని, అది మాన భావాలు, వ్యక్తిత్వ లక్షణాలు ప్రతిబింబించే ఒక అద్దమన్నారు. అనంతరం యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.మల్లికార్జున రావు మాట్లాడుతూ ప్రతి అక్షరం ఒక ముద్ర, ప్రతిపంక్తి ఒక గాథ అని, గ్రాఫాలజీ ద్వారా వ్యక్తిత్వ లక్షణాలను అర్థం చేసుకునే ఒక శాస్త్రమని వారు తెలిపారు. వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ గ్రాఫాలజీ ద్వారా వ్యక్తిత్వాన్ని మార్చవచ్చని, విద్యార్థుల అభివృద్ధి కోసం తమ కళాశాలలో అన్ని సదుపాయాలు కల్పించామని వాటిని సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని వారు కోరారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ మాట్లాడుతూ చేతిరాత మానసిక శక్తిని, ఊహాశక్తిని పెంపొందిస్తుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యత నిర్మూలనకే ‘ఉల్లాస్’

వీరబల్లి : నిరక్షరాస్యత నిర్మూలనే ఉల్లాస్ లక్ష్యమని ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సభా భవనంలో మండలస్థాయి శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మొదటి విడతలో మండలంలోని 500 మంది నిరక్షరాస్యులను గుర్తించినట్లు తెలిపారు. ప్రతి వలంటీర్ టీచర్‌కు 10 మంది చొప్పున నిరక్షరాస్యులను కేటాయించడం జరుగుతుందని చెప్పారు. ఉత్తమమైన పద్ధతులతో బోధన ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ఏపీఎం ఖాదర్ వలీ, సీసీలు కృష్ణయ్య, నాగేంద్ర, సుధాకర్, గంగాధర్, బ్యాంక్ ప్రతినిధి చంద్ర, సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి, కార్యదర్శి గులాబ్ జాన్, కోశాధికారి లావణ్య, వీఓఏలు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలకు విశేష స్పందన

రాజంపేట రూరల్ : పశువైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోందని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ అదనపు సంచాలకులు డాక్టర్ కె.వెంకట్రావు తెలిపారు. మండలంలోని ములక్కాయపల్లెలో గురువారం నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గుండ్లూరు, మిట్టమీదపల్లె గ్రామాల్లో నిర్వహించిన పశువైద్య శిబిరాల్లో 44 దూడలకు, 173 ఆవులు, గేదెలకు, 1936 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును తాపించినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన వెంకటరామరాజుకు ప్రభుత్వం సబ్సిడీతో మంజూరు చేసిన గడ్డికత్తరించే యంత్రాన్ని పరిశీలించారు. పుల్లంపేట మండలం కోనయ్యగారిపల్లె పశువైద్య శిబిరాన్ని పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ కె.గుణశేఖర్ పిళ్లై, ఆ శాఖ ఉపసంచాలకులు వై.విజయభాస్కర్‌రావు, డాక్టర్ కె.ప్రతాప్, డాక్టర్ కె.భాగ్యవతి, వరదయ్య, సుదీష్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రామాపురం : పాల దిగుబడి బాగా రావాలంటే పాడిపశువులకు మంచి పోషకాలు కలిగిన ఆహారాన్ని అందించాలని మండల పశు వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని బండపల్లె పంచాయతీ పుత్తుకూరుపల్లి, బండపల్లె దళితవాడలలో పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 2,940 గొర్రెలు, మేకలకు, 52 పశువులకు, 48 దూడలకు నట్టల నివారణ మందు త్రాగించారు. 32 పశువులకు ప్రథమ చికిత్స అందించారు. మూడు గర్భకోశ సమస్యలు గల పశువులకు 4 పశువులకు సూలు పరీక్షలు నిర్వహించారు. పాల దిగుబడి బాగా రావాలంటే పోషకాలు గల మేలు రకం పచ్చి గడ్డి ఆహారంగా అందించాలని, పశువుల పాకలో ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని పాడి రైతులకు సూచించారు.

సుండుపల్లెలో..

సుండుపల్లె : మండల పరిధిలోని మాచిరెడ్డిగారిపల్లి, కటారుమడుగు గ్రామాలలో ఉచిత పశువైద్య శిబిరాలను ఏడీ విజయ్ కుమార్ గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశువులకు ప్రథమ చికిత్స, గర్భకోశ సమస్య, కృత్రిమ గర్భధారణతోపాటు దూడలకు, గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు, పారుడు వ్యాధులకు వ్యాక్సిన్లను అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యులు రవికుమార్, సుండుపల్లి పశుసంవర్ధక శాఖ సిబ్బంది, గోపాల మిత్రలు పాల్గొన్నారు.



రాజంపేట రూరల్: గడ్డికత్తిరించే యంత్రాన్ని పరిశీలిస్తున్న వెంకట్రావు

చిన్నమండెంలో..

చిన్నమండెం : మండల పరిధిలోని సి.పాలిమేరపల్లి, బోనమల గ్రామాల్లో గురువారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించినట్లు పశు వైద్యాధికారి డాక్టర్ గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన పాడి పశువులకు నట్టల నివారణ మందులను వైద్యాధికారులు తాపించారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.